www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 29 జులై 2023
5
పశ్చిమ గోదావరి

డిఎస్‌పి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో నిర్మించిన తాడేపల్లిగూడెం డిఎస్‌పి కార్యాలయాన్ని శుక్రవారం ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాకు ముఖద్వారంగా ఉన్న తాడేపల్లిగూడెం ప్రాముఖ్యతను మరింత పెంచుతూ సిఎం జగన్ తన కోరికను మన్నించి పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం ఇచ్చారన్నారు. అతి త్వరలోనే ఆర్‌డిఒ కార్యాలయాన్ని కూడా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి యు.రవిప్రకాష్, అడిషనల్ ఎస్‌పి సుబ్బరాజు, తాడేపల్లిగూడెం డిఎస్‌పి సి.శరత్‌రాజ్‌కుమార్, టౌన్ సిఐ వి.నాగరాజు, రూరల్ సిఐ ఎస్ఎస్ఎస్.మూర్తి, తణుకు రూరల్ సిఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

ముంపులోనే పొలాలు..!

ఆచంట మండలంలో నీటమునిగిన వరి చేలు

రెండు జిల్లాల్లోనూ వరద నుంచి
తేరుకోని వేలాది ఎకరాలు
'పశ్చిమ'లో 4,700 ఎకరాల్లో వరినాట్లు మునక
ఏలూరు జిల్లాలో 4,230 ఎకరాలు
ముదినేపల్లి మండలంలో
అధికంగా దెబ్బతిన్న పంటలు
లంకగ్రామాల రైతుల్లో తీవ్ర ఆందోళన
మళ్లీ గోదావరి ఉగ్రరూపం
పునరావాసానికి తరలుతున్న కుక్కునూరు,
వేలేరుపాడు మండలాల ప్రజలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అన్నదాత పరిస్థితి అయోమయంగా మారింది. ఖరీఫ్‌సాగులో ఆదిలోనే కోలుకోని దెబ్బతగిలింది. గోదావరి వరద, ఎడతెరిపిలేని వర్షాలకు రెండు జిల్లాల్లోనూ వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఇప్పుడిప్పుడే నాట్లు వేసిన పొలాలు మునిగిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో పెట్టుబడులు కోల్పోయి ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా ఖరీఫ్‌లో 2.53 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. 11,067 ఎకరాల్లో నారు మడులు వేశారు. ఇప్పటి వరకూ 61 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ఇంకా దాదాపు లక్షా 90 వేల ఎకరాల్లో నాట్లు పూర్తికావాల్సి ఉండగా పొలాల్లో వరద నీరు చేరడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. వరదకు 265 ఎకరాల్లో నారుమడులు, 4,700 ఎకరాల్లో వరినాట్లు నీటమునిగాయి. ఈ లెక్కలు అధికారులు చెబుతున్నవి. వాస్తవానికి నీటమునిగిన పొలాలు చాలా ఎక్కువగానే ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. నాట్లు వేసిన రైతులు ఇప్పటికే నారుమడి, దమ్ము, నాట్లు వేసేందుకు ఇలా ఎకరాకు దాదాపు రూ.15వేల వరకూ పెట్టుబడి పెట్టారు. ముంపులో ఉన్న వరినాట్లు వేసిన పొలాలు దెబ్బతినే ప్రమాదం ఏర్పడటంతో రైతులకు ఏంచేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సాగులో ఆదిలోనే నష్టాల మిగల్లడంతో అన్నదాత తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

ఏలూరు జిల్లాలోనూ వరిపంట పెద్దఎత్తున నీటమునిగింది. ఈ జిల్లాలో వ్యవసాయాధికారులు ముంపునకు సంబంధించిన వివరాలను అధికారికంగా చెప్పడం లేదు. ఈ జిల్లాలో 93వేల ఎకరాల్లో వరినాట్లు వేయగా, 4,230 ఎకరాలు నీటమునిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. భీమడోలు మండలంలో 550 ఎకరాలు నీటమునిగాయి. ముదినేపల్లి మండలంలో 15వేల ఎకరాల్లో వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేపట్టారు. ఇక్కడ దాదాపు పదివేల ఎకరాల్లో పంట నీటమునిగినట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితి స్పష్టంచేస్తోంది. ఉంగుటూరు, నిడమర్రు, దెందులూరు మండలంలోనూ వరద ముంపునకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొల్లేరుకు వరదనీరు పోటెత్తడంతో పరివాహక ప్రాంతాలను ఆనుకుని ఉన్న పొలాలన్నీ నీటమునుగుతున్నాయి. లంకగ్రామాల్లోనూ వరదకు పంటలు నీటమునుగుతున్నాయి. ఆచంట, యలమంచిలి వంటి మండలాల్లో ఇప్పటికే పలుచోట్ల పొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో లంకగ్రామాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

మళ్లీ గోదావరి ఉగ్రరూపం

గోదావరి వరద మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. గురువారం తగ్గినట్లే తగ్గి శుక్రవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద నీటిమట్టం 51 అడుగులకు చేరింది. తెల్లవారితే మరో ఐదారు అడుగులు వరద పోటు పెరిగే పరిస్థితి ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. పోలవరం ఎగువ కాఫర్‌డ్యాం వద్ద సైతం 34.300 మీటర్ల నీటిమట్టం నమోదైంది. వరద పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం కుక్కునూరులోని 'ఎ' బ్లాక్, రామాలయం సెంటర్, దాసరి బజార్, రజకబజార్ ప్రాంతాలకు చెందిన 200 కుటుంబాలను కివ్వాక పునరావాస కాలనీకి తరలించారు. కొండెన్న ముక్కికి చెందిన దాదాపు 50 కుటుంబాలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. వేలేటూరు గ్రామం, ఎస్‌సి కాలనీకి మధ్య రోడ్డుపై వరద నీరు చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వేలేరుపాడు మండలంలోనూ పలు గ్రామాల ప్రజలను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజును అఖిలపక్షం ఆధ్వర్యంలో వేలేరుపాడులో నాయకులు, స్థానిక ప్రజానీకం అడ్డుకున్నారు. తమకు పరిహారం ఎప్పుడిస్తారంటూ నిలదీశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్తానని చెప్పడంతో అంతా తమ ఆందోళనను విరమించారు.

ఆచంట మండలంలో ఇళ్ల మధ్యలోకి చేరిన వరద

పోటెత్తిన వశిష్ట గోదావరి

వణుకుతున్న లంకలు
నీటమునిగిన పంటలు
అప్రమత్తమైన అధికారులు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి ఉగ్రరూపం దాల్చింది. వరద ఉధృతి గంట గంటకు పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి మరింత ఉధృతంగా మారింది. ధవళేశ్వరం నుంచి పెద్ద ఎత్తున వరద నీరు సముద్రంలోకి వదులుతుండటంతో వశిష్ట గోదావరి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో లంక గ్రామాలకు వరద నీరు చేరుతోంది. మండలంలో పుచ్చల లంక, నెక్కిడి లంక, రాయిలంకలు ముంపుబారిన పడ్డాయి. అయోధ్యలంకలో పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు చేరుతుంది. అయోధ్యలంకలో ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహిస్తుంది. లంకవాసులకు రాకపోకలు నిలిచిపోవడంతో వారు నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నారు.

నీటమునిగిన పంటలు

లంక గ్రామాల్లోకి వరదనీరు చేరడంతో వందలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ప్రధానంగా తమలపాకు రైతులకు తీవ్ర నష్టాలు తప్పడం లేదు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టామని రైతులు వాపోతున్నారు. పచ్చిమిర్చి, అరటి, వంగ, బెండ, బీర, ఆనబ, చిక్కుడు, మునగ, తోటకూర, గోంగూర తదితర కూరగాయ తోటలు కూడా పూర్తిగా నీట మునిగాయి. రైతులు సురక్షిత ప్రాంతాలకు పశువులను తరలిస్తున్నారు. లంక గ్రామాల నుంచి కొబ్బరికాయలను ఇంజన్ పడవల ద్వారా ఏటిగట్టుకు తరలిస్తున్నారు. వరద ఉధృతి మరింత పెరుగుతున్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు కోరుతున్నారు.

యలమంచిలి: ఎగువ ప్రాంతాల నుండి వచ్చి చేరుతున్న వరదనీటి ప్రవాహంతో శుక్రవారం గోదావరి ఉరకలేస్తోంది. దీని ప్రభావంతో లంక గ్రామాలైన కనకాయలంక, పెద్దలంక, బాడవ, యలమంచిలిలంక, లక్ష్మిపాలెం, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుపల్లి తదితర లంక గ్రామాల్లోని ఇళ్లచుట్టూ వరద నీరు చేరుతుంది. పల్లపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏ గ్రామానికి ఆ గ్రామంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, అత్యవసరంగా ఉపయోగపడే నిత్యావసర సరుకులు, మందులు, తాగునీరు, ఇతర సామగ్రిని సిద్ధం చేసి ఎప్పటికప్పుడు లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ.. తగు సూచనలు చేస్తున్నామని తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ తెలిపారు.

పెనుగొండ: వశిష్ట గోదావరి పోటెత్తడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లంక భూముల్లో ఉన్న పాడి పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి హెడ్ వర్క్ డిఇ శ్రీనివాసరావు, ఎఇ పవన్ కుమార్, దొంగ రావిపాలెం, సిద్ధాంతం, నడిపూడి చినమల్లం ప్రాంతాలను పరిశీలించారు. వర్షాలకు ఏటి గట్టుకుపడిన గండ్లను ఇసుక బస్తాలతో పటిష్టపరిచారు. అదేవిధంగా మరో 3500 ఇసుక బస్తాలను అందుబాటులో ఉంచామని తెలిపారు.

మంత్రి బొత్స దృష్టికి జిల్లా విద్యారంగ సమస్యలు

విన్నవించిన ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఎస్‌ఎఫ్‌ఐ నేతలు విజయవాడ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిసి విద్యారంగ సమస్యలను వివరించారు. ఈనెల పదో తేదీ నుండి 20వ తేదీ వరకూ నిర్వహించిన సైకిల్ యాత్రలో ఎస్‌ఎఫ్‌ఐ బృందానికి వచ్చిన పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. జిల్లాలో పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని, జూనియర్ కాలేజీల్లో అధ్యాపకుల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పాఠ్యపుస్తకాలు పూర్తిగా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలకు ఆట స్థలాలు కేటాయించాలని, వీరవాసరం జెడ్‌పి హైస్కూల్లో నిలిచిపోయిన ఇండోర్ స్టేడియంను పూర్తిచేయాలన్నారు. తాడేపల్లిగూడెం, పాలకోడేరు, ఉండి మండలాల్లో చైతన్య గోదావరి సంస్థ ద్వారా అందిస్తున్న మధ్యాన్న భోజన పథకం నాణ్యంగా లేదని ఆయనకు వివరించారు. పాలకొల్లు ఎఎస్ఎం, తణుకు ఎస్‌సిఐఎం కళాశాలలో (ఎంఎస్‌సి ఎనలిటికల్ కెమిస్ట్రీ, ఎంఎస్‌సి ఫిజిక్స్, ఎంబిఎ, ఎంసిఎ, ఎంఎ, ఇతరాలు) అదనపు పోస్టులను ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. భీమవరంలో ఆర్‌ఆర్‌డిఎస్ కళాశాలలో సైన్స్ గ్రూపులకు అధ్యాపకులు లేరని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. భీమవరంలో కొత్త ప్రభుత్వ పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. నరసాపురంలో నిర్మాణం పూర్తయిన నర్సింగ్ కళాశాలను ఈ సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలో ఖాళీ పోస్టులను పది రోజుల్లో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. పీజీ కళాశాలలో అదనపు కోర్సులు జిల్లాలో విద్యార్థుల సంఖ్యను ఆసక్తిని తెలుసుకుని పీజీ కోర్సులను పెంచుతామని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి నాణ్యమైన మధ్యాహ్నభోజనం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిని అందించిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్న, ఎ.అశోక్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.వాసు, డి.పెద్దిరాజు, జిల్లా ఉపాధ్యక్షులు టి.ప్రసాద్ ఉన్నారు.

పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో లంక గ్రామాల్లోని పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పశు సంరక్షణ అసిస్టెంట్ డైరెక్టర్ జె.జాన్సన్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లంకగ్రామాల్లో సుమారు 1800 పశువులకు ముందస్తుగా అంటువ్యాధులు ప్రబలకుండా గొంతువాపు టీకాలు వేశామన్నారు. వరద ఉధృతి నేపథ్యంలో పెదమల్లం లంక ఆనగార్లంక గ్రామాలకు ప్రత్యేకంగా వెటర్నరీ అసిస్టెంట్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ఆయోధ్యలంక పంచాయతీ పరిధిలో కూడా వెటర్నరీ అసిస్టెంట్లను అందుబాటులో ఉంచామని చెప్పారు. వరద కారణంగా ఎక్కువగా విష సర్పాలు సంచరిస్తాయని, పశువులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తుగా వ్యాక్సిన్ అందుబాటులో ఉంచినట్లు ఆయన తెలిపారు. పశువులకు పశుగ్రాసం కొరత కారణంగా దాతలు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ఫణికుమార్ ఉన్నారు.

నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ బదిలీ

ప్రజాశక్తి - పాలకొల్లు

నరసాపురం సబ్ కలెక్టర్ మల్లవరపు సూర్యతేజ బదిలీ అయ్యారు. ఆయనను కెఆర్‌పురం ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్‌గా నియమించారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. ఆయనతో పాటు పలువురు ఐఎఎస్ అధికారులను శుక్రవారం బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కెఎస్.జవహర్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

వరద ముంపును ఎదుర్కొనేందుకు సంసిద్ధం

ప్రజాశక్తి - భీమవరం

గోదావరి పరివాహక ప్రాంత గ్రామాల్లో వరద ముంపును ఎదుర్కొవడానికి అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉన్నామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వరద ప్రభావం ఉన్న ఐదు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంలో జిల్లాలోని వరద పరిస్థితులు, తీసుకున్న చర్యలపై కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరిస్తూ వరద ప్రభావం ఎదుర్కొవడానికి అన్ని విధాలుగా సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో కలెక్టరేట్, డివిజన్, మండల హెడ్ క్వార్టర్స్‌లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైతే రెస్క్యూ, పునరావాసం కోసం గ్రామాల వారీగా ప్రత్యేక అధికారులను, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నేటికి ఎలాంటి నష్టం జరగలేదని, ఇళ్లు ముంపునకు కూడా గురికాలేదని తెలిపారు. యలమంచిలి, ఆచంట, నరసాపురం మండలాల్లో గోదావరి పరివాహక ప్రాంతానికి ఆనుకుని ఉన్న లంక గ్రామాల్లో అవసరమైన మోటార్ బోట్లు లైఫ్ జాకెట్లతో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. నరసాపురం డివిజన్‌లో 34 గ్రామాలు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్నాయని, యలమంచిలి మండలంలోని కనగాయలంక, పెదలంక గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యాయని తెలిపారు. పునరావాస కార్యక్రమాల్లో భాగంగా 124 మంది గర్భిణులను, 127 మంది పిల్లలను తల్లులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. 22 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

అధిక వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పొలాల పరిశీలనకు కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని మినిమించిలిపాడు, ఎ.వేమవరం, కోనపోతు గుంట, పెనుమంచిలి గ్రామంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు నక్కల కాలువను ఏళ్ల తరబడి ఆధునీకరించకపోవడంతో పొంగిపోవడం, వడ్డిలంక వద్ద లాకులు శిథిలావస్థకు చేరుకోవడంతో తలుపులు సక్రమంగా పనిచేయకపోవడంతో ఆచంట, యలమంచిలి, పోడూరు మండలాల్లో ప్రతిఏటా వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిని కౌలురైతులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పంట నష్టపోయిన కౌలురైతుల పేర్లు నమోదు చేయటంలేదని, వంద మందిలో 20 మందికి కూడా కౌలు కార్డులు ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు కొండేటి సత్యనారాయణ, దొమ్మేటి సూర్యనారాయణ, యాండ్ర విజయసత్యనారాయణ, బోళ్ల శ్రీనివాస్, గుబ్బల ఏడుకొండలు, కడలి శ్రీను, ఆరిమిల్లి నారాయణరావు, బోళ్ల ఆంజనేయులు, బొబ్బా సత్యనారాయణ పాల్గొన్నారు.

30న కార్మిక, కర్షక రాష్ట్ర సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - పెంటపాడు

ఈనెల 30వ తేదీన రైతు సంఘం ఆధ్వర్యాన జరిగే కార్మిక కర్షక రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు పిలుపునిచ్చారు. విజయవాడలో సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగే ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ పెంటపాడు ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చింతకాయల బాబూరావు, గణపవరం మండల రైతు సంఘం నాయకులు గుత్తుల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రిటిష్ కాలం నుంచి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికులకు ఏ విధమైన హక్కులూ లేకుండా యజమానులకు అనుకూలంగా కార్మిక చట్టాలను మార్పు చేశారని, ఈ దేశంలో వ్యవసాయ రంగం మీద 65 లక్షల కోట్ల రూపాయలు ఆదాయం సమకూర్చే వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పడానికి మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చారని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా సుమారు 13 నెలలపాటు 500 రైతు సంఘాలు ఆందోళన ఫలితంగా నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నారని తెలిపారు. ఆ సందర్భంగా ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టాన్ని పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రతీ సంవత్సరం నిధులు తగ్గించి ఆ చట్టాన్ని నీరుగార్చే విధంగా ప్రయత్నిస్తుందని, అలాగే ఈ దేశంలో 70 శాతంగా ఉన్న కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వక పంట నష్టపరిహారం ఇవ్వక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో మాదాజు శ్రీను, పెనగంటి దుర్గ పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసను ఆపాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

మణిపూర్‌లో హింసకాండను ఆపాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దరాజు, సిఐటియు పట్టణ అధ్యక్షులు ముచ్చర్ల త్రిమూర్తులు, పలువురు నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో మూడు నెలలుగా జాతుల మధ్య ఉన్న సున్నితమైన సమస్యను పరిష్కరించాల్సిన డబల్ ఇంజన్ సర్కార్లు మత విద్వేషాలు, మతోన్మాద దాడులకు ఉసుగొల్పి దమన కాండను సృష్టిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, దమనకాండను ప్రపంచానికి తెలియనివ్వకుండా ఇంటర్నెట్ సదుపాయం కూడా బంద్ చేసి పరోక్షంగా రాజ్యమే హింసను ప్రేరేపించటం ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు వాటిల్లుతుందన్నారు. మూడు నెలల నుంచి మణిపూర్‌లో జరుగుతున్న దమనకాండ, హింస, మహిళలపై అత్యాచారాలపై దేశ ప్రధాని స్పందించకపోవడం చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మణిపూర్‌ను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము, నోముల కొండ, నారాయణరావు, మైనారిటీ నాయకులు షన్వాజ్ ఖాన్, కెవిపిఎస్ నాయకులు బుడితి ఇజ్రాయిల్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్రైస్తవ నాయకుల ఆధ్వర్యంలో స్టేషన్‌పేట వై.రూబెన్ స్వగృహంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ప్రముఖ న్యాయవాది ఇంజెటి జాన్ కెనడి మాట్లాడారు. నరసాపురం పట్టణంలో ఈ నెల 29వ తేదీ శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు థామస్ బ్రిడ్జి వద్ద నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు శాంతిర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు.

భీమవరం రూరల్ : మణిపూర్‌లో మహిళలను ఊరేగించి అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు యమునాపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బుంగ కటాక్షరావు పాల్గొన్నారు.

ఉండి : మణిపూర్ ఘటన నిందితులను కఠినంగా శిక్షించి ప్రశాంత వాతావరణన్ని నెలకొల్పాలని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ కొర్రపాటి అనిత

నరసాపురంలో మాట్లాడుతున్న నాయకులు

కోరారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద కొర్రపాటి అనిత నేతృత్వంలో చెరుకువాడ గ్రామంలోని ఏడు సిబిసిఎన్‌సి సంఘాలు శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టి ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.వీరాస్వామినాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బందెల ప్రమీల జార్జ్, నాగన్న, సంఘ కాపరులు బిల్ మోరియా, జార్జి ముల్లర్, క్రైస్తవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : మణిపూర్ అల్లర్లను ఖండిస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), ఆల్ ఇండియా దళిత రైట్ ఫోరమ్(ఎఐడిఆర్ఎఫ్) ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా జాయింట్ సెక్రటరీ చిన్నం చిననాగేశ్వరరావు మాట్లాడుతూ మణిపూర్‌లో మతోన్మాద అల్లరులకు పాల్పడిన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫొరం (ఎఐడిఆర్ఎఫ్) జిల్లా అధ్యక్షులు బట్టు నాగరాజు, అరిగెల రాజేష్, కేదాసి ప్రసాద్, కేసరిపల్లి వెంకట్రావు, మైఖేల్, రాపాక నాని, బద్దె కిరణ్, చింతల అశోక్ పాల్గొన్నారు.

పోడూరు : మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమం ఆపాలని సిఐటియు నాయకులు పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో జిన్నూరులో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మణిపూర్‌లో సుమారు మూడు నెలలుగా ప్రజలపై మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా ప్రధాని మోడీ పట్టింపు లేకుండా వ్యవహరించటం అన్యాయమని విమర్శించారు. ఇప్పటికైనా బాధ్యత వహించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంతుశ్రీను, కొప్పర్తి నరసింహమూర్తి, కుమారి, దాడి గౌరమ్మ పాల్గొన్నారు.

అన్ని వసతులతో పునరావాస కేంద్రాలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఆచంట



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని, లంక ప్రాంతాల ప్రజలు తక్షణం తరలిరావాలని కలెక్టరు పి.ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని కోడేరు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యటించి, వరద ఉధృతిని పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారని, అధికారులను మరింత అప్రమత్తం చేశామని ఆమె అన్నారు. లంక, లోతట్టు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రతి గ్రామానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో నిధులు విడుదలతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అవసరమైన చోట్ల బోట్లు, వాహనాలు సిద్ధం చేశామన్నారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. లంక, ప్రభావిత గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతూ మంచం మీద ఉండేవారిని 18 మందిని గుర్తించి దగ్గరలో ప్రభుత్వాసుపత్రుల్లో చేర్చామన్నారు. మత్స్యకారులను వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని, గోదారి పరివాహక ప్రాంతాల్లో ,ప్రమాద ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. గోదావరి ఏటిగట్లను నిరంతరం పర్యవేక్షించాలని, అనుమానం ఉన్నచోట యుద్ధ ప్రాతిపదికన రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇసుక బస్తాలు సిద్ధం చేసుకుని పాయింట్ల వారీగా నిల్వలు పెట్టుకోవాలని, ఏమైనా ఇబ్బందులుంటే వెంటనే తెలపాలన్నారు. పునరావాస కేంద్రాల్లో బియ్యం, నిత్యావసర వస్తువులు, గ్యాస్ సిలిండర్లు, జనరేటర్లు తదితర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ నిరంతరాయంగా పనిచేయాలని ఏ ఫోన్ వచ్చినా వెనువెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. పశువులు, గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఇప్పటికే వరద ముంపు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో అన్ని రకాలు మందులతోపాటు, పాము కాటు విరుగుడు మందును ఉంచి నిరంతరాయంగా పనిచేస్తున్నాయన్నారు. అవసరమైన తాగునీరు అందించేందుకు వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామన్నారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు వారి పరిధిలో బాధితులకు సహాయక చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డి.వీరస్వామి, తహశీల్దారు సుబ్రహ్మణ్యం, ఎంపిడిఒ జగన్నాథరావు, పశుసంవర్థక ఎడి జాన్సన్, మండల పశువైద్యాధికారి ఫణికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మూర్తిరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి మొక్కలు నాటి పెంచాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఐఎఎస్ అధికారుల సతీమణుల సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక గొల్లవానితిప్ప రోడ్డు వెంబడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సతీమణి సి.ప్రసన్నతో కలిసి ప్రారంభించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 400 మొక్కలను రెండు కిలోమీటర్ల పరిధిలో నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ ఎర్త్... గ్రీన్ ఆంధ్ర ప్రదేశ్ నినాదంతో ఐఎఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. హరిత పశ్చిమగోదావరి జిల్లాగా రూపురేఖలు మార్చడం కొరకు డ్వామా, ఇండస్ట్రీస్, ఎన్‌జిఒస్, విద్యాసంస్థలు ఆధ్వర్యంలో 50 వేల మొక్కలు ఒకేసారి జిల్లాలో నాటుతున్నామని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపు నిచ్చారు. గొల్లవానితిప్పలో మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి వారి సతీమణితో వచ్చి మొక్కలు నాటారు. నగరవనం పథకంలో భాగంగా చేపట్టిన ఈ మొక్కలు నాటే కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, డ్వామా పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు, డిఆర్‌డిఎపిడి ఎంఎస్ఎస్.వేణుగోపాల్, డిఇఒ ఆర్.వెంకటరమణ, ఉపాధి హామీ ఎపిడి విజయలక్ష్మి, ఉపాధిహామీ సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ సభ్యులు పాల్గొన్నారు.

కాళ్ల : పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పెదఅమిరంలో ఉప్పరగూడెం-ఉండి రోడ్డు వెంబడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె జెసి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి సతీమణి సి.ప్రసన్నతో కలిసి ప్రారంభించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఉపాధి హామీ చట్టం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కారక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి పి.శిరీష విశ్వనాథరాజు, గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు గణేశ్న రాంబాబు, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్లు వేగేశ్న జయరామకృష్ణంరాజు, పి.దుర్గాప్రసాదరాజు, టెక్నికల్ అసిస్టెంట్ బుంగా రమేష్ బాబు, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో తణుకు నియోజకవర్గం దువ్వ, అత్తిలి, ఇరగవరం గ్రామాల్లో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాల విద్యార్థులకు వివరించారు. మండలంలో 2,500 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎన్ఎం కళాశాలకు నాక్ బృందం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గురువారం నాక్ బృందం వచ్చింది. కమిటీ సభ్యులు ప్రొఫెసర్ దిబాకర్ చంద్రదేక, ప్రొఫెసర్ రంజన్ అనేజా, డాక్టర్ బాలకృష్ణ కాంబ్లేలకు ప్రిన్సిపల్ డాక్టర్ రాజరాజేశ్వరి స్వాగతం పలికారు. కళాశాలలోని అన్ని శాఖలు, సపోర్టింగ్ సర్వీసెస్‌ను పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం అయ్యారు. కళాశాలలోని టీచింగ్, నాన్ టీచింగ్ సభ్యులతో సమావేశమయ్యారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు.

కిడ్నీ బాధిత చిన్నారికి రూ.లక్ష చెక్కు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 18వ వార్డు రాజీవ్ నగర్‌కు చెందిన మామిడి దుర్గాప్రసాద్ కుమార్తె కిడ్నీ సమస్యతో బాధపడుతుంది. ఈ సమస్యను ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎల్ఓసి ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం మంజూరు చేయించారు. ఆ చెక్కును శుక్రవారం పాలకొల్లు కార్యాలయంలో బాధిత కుటుంబానికి అందించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఈ నెల 29వ తేదీ శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చిన అమిరం గ్రామస్తులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత వర్మ, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు చెప్పారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేషన్, ప్రసాద్ అండ్ కో సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిబిరంలో అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం కూడా భాగస్వామ్యం అవుతుందని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.కృష్ణచైతన్య చెప్పారు.

కోపా సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

కోపా సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. కాపు, తెలగా, ఒంటరి, బలిజ, అఫీషియల్స్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సుంకర తాతారావు కళ్యాణ మండపం నిర్మించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా త్వరలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో కోపా సేవా సమితి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు యర్రంశెట్టి హరినాథ్, కార్యదర్శి సత్యనారాయణ, దాయాని చంద్రాజి, మురళీకృష్ణ, బోణం పాండురంగారావు, సాయి దుర్గాప్రసాద్, మట్లపూడి సత్యనారాయణ, తోట సుబ్బారావు, జివిఆర్.నాయుడు, కత్రెడ్డి సత్యనారాయణ, కడియం ఈశ్వర్, పావురాల రామ్మోహన్‌రావు, చాత్రాతి సుబ్బారావు, శేషాద్రి శ్రీనివాస్, తాణాల వెంకటరమణ, చామన సాయి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతిలో ఖర్చు తక్కువ

ప్రజాశక్తి - అత్తిలి

రైతులు మేలైన యాజమాన్య పద్ధతి ద్వారా ద్వారా సాగు వ్యయం తగ్గించుకోవచ్చని ఎఒ టికె.రాజేష్ అన్నారు. మంచిలిలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు బ్యాలెట్ పేపర్ పరీక్ష నిర్వహించడం గురించి తెలిపారు. రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విఎఎ చంద్రిక, కృష్ణ, చారి, శిరీష పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువు చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పాతపాడు, కెపి.పాలెం సౌత్ గ్రామాల్లో సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముదునూరి ప్రసాదరాజు ఆరుగురికి ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వాతాడి తులసి ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమల బాపూజీ, వైస్ ఎంపిపి సుబ్బారావు, సొసైటీ చైర్ పర్సన్ దొంగ నాగమణి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలభారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.కృష్ణమూర్తి కోరారు. రైతు సంఘం నాయకులు వివిధ ప్రాంతాల్లో పర్యటించారని చెప్పారు. కైకలూరు ప్రాంతంలో చేపలు చెరువులకు నష్టం వాటిల్లిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ అధికారులను ఆదేశించి నష్టాలను అంచనా వేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు ఉచితంగా అందించాలని, ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎలక్ట్రికల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

విద్యుత్ ఉద్యోగుల కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు రెండో రోజు శుక్రవారం భోజన విరామ సమయంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం డివిజన్ జెఎసి చైర్మన్ గుబ్బల శ్రీకాంత్ మాట్లాడుతూ నిరసన కార్యక్రమలకు ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు ఒకటో తేదీన నరసాపురం నుంచి ఏలూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించి ఏలూరులో ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. నిరసన కార్యక్రమాలకు జెఎసి కన్వీనర్‌గా గంటసాల వెంకటేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పులి ఓంకార్, ట్రెజరర్ షణ్ముఖరావు, కో చైర్మన్ మారంపూడి రాజు, వైస్ చైర్మన్లు రవిశంకర్, సిహెచ్.ఫణిరాజా, మైనారిటీ అసోసియేషన్ నిర్వాహకుడు అబ్దుల్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పశువులకు దాణా అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి - పెనుగొండ

పాడి పశువులకు దాణా అందుబాటులో ఉంచాలని ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు అధికారులను ఆదేశించారు. వశిష్ట గోదావరి ఉధృతి పెరగడంతో సిద్ధాంతం నడిపూడి లంక రైతులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చింతపల్లి గనిరాజు, ఎంపిటిసి సభ్యులు చిన్నం ఏడుకొండలు పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

పొలాల్లో నీరు బయటకు తోడేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ సహాయ సంచాలకులు అనితకుమారి సూచించారు. మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం పలు గ్రామాల్లో మునిగిపోయిన ఆకుమడులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

నేరాలు - ఘోరాలు

బాలికపై లైంగిక వేధింపులు

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - ఉండి

బాలికను వేధింపులకు గురి చేసిన యువకునిపై ఉండి పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాందువ్వ గ్రామానికి చెందిన యువకుడు గులిపల్లి వెంకటేష్ అదే గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో ఎవరూ లేకపోవడం చూసి ఇంట్లోకి వెళ్లి బాలికను లైంగికంగా వేధించాడు. బాలిక కేకలు వేయడంతో యువకుడు పారిపోయాడు. బాలిక ఫిర్యాదు మేరకు వెంకటేష్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా ఉండాలి : సిఐటియు

ప్రజాశక్తి - పెనుమంట్ర

జిల్లాలో ఉద్యోగ, కార్మికుల సమస్యలపై నిర్విరామంగా కృషి చేసి వారి ఐక్యత కోసం పని చేయడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. మార్టేరులోని దేవాంగ కళ్యాణ మండపంలో జరుగుతున్న సిఐటియు జిల్లాస్థాయి వర్క్‌షాపును శుక్రవారం మొదటిరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు రోజువారి జీవితంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సిఐటియు అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి మరింత కృషి చేస్తుందన్నారు. కరోనా తర్వాత పారిశ్రామిక రంగంలోనూ వ్యవసాయ రంగంలోను అనేక మార్పులు వచ్చాయని, దీంతో అసంఘటిత రంగంలో కార్మికవర్గం గణనీయంగా పెరిగారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొచ్చి యూనియన్స్‌ని ఏర్పాటు చేసుకోవడం దగ్గర నుంచి కనీస వేతనాలు ఇతర సౌకర్యాలు మీద ప్రభావం చూపించే విధంగా మార్పులు తీసుకొచ్చిందన్నారు. దీంతో కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే ప్రభుత్వ రంగం హరించుకుపోయి ప్రయివేట్ రంగం పెరుగుతుందన్నారు. ప్రయివేట్ రంగంలో ఎటువంటి గ్యారెంటీ లేకుండా కార్మికులు నలిగిపోతున్నారన్నారు. ప్రభుత్వ రంగంలో కూడా పిఆర్‌సి ఒపిఎస్ వంటి వాటిని సక్రమంగా అమలు చేయకుండా ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. జిల్లాలో వలస కార్మికుల సంఖ్య పెరిగిందన్నారు. వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వీటన్నిటి మీద సిఐటియు సమగ్ర అవగాహనతో పనిచేస్తుందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ జిల్లాలో కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై పనిచేయడంతో పాటు వారి ఐక్యత కోసం ఇంకా విస్తృతంగా కృషి చేసేందుకు ప్రణాళిక రూపొందించుకుంటున్నామని చెప్పారు. ఈ రెండు రోజుల వర్క్‌షాపునకు కర్రి నాగేశ్వరరావు ప్రిన్సిపల్‌గా వ్యవహరించగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, పివి.ప్రతాప్, బి.వాసుదేవరావు, ఎస్.వెంకటేశ్వరరావు, డి.కళ్యాణి, ఎ.జాన్సీలక్ష్మి, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, ఎండి హసీనా, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ విద్య

ప్రజాశక్తి - వీరవాసరం

జిల్లాలో పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను హైస్కూల్స్ ప్లస్ (ఇంటర్ మీడియట్) కోఎడ్యుకేషన్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జిల్లా స్థాయి అధికారులకు ఉత్తర్వులు పంపినట్లు సమాచారం. ఈ విధంగా జిల్లాలో తొమ్మిది మండలాల్లో హైస్కూల్స్‌లో ఇంటర్ మీడియట్ విద్య అందుబాటులోకి రానుంది. మండలానికి రెండు చొప్పున హైస్కూల్స్‌ను అప్‌గ్రేడ్ చేసేందుకు గతంలో ప్రతిపాదనలు పంపారు. రవాణ, హైస్కూల్‌లో మౌళిక వసతులు, తరగతి గదులు, ల్యాబోరేటరీలు, లైబ్రరీలు, ఆట స్థలం, విద్యార్థుల సంఖ్య తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రతిపాదించిన హైస్కూల్స్‌లో ఒక దానిని ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ విషయమై మండల విద్యాశాఖాధికారి శ్రీమన్నారాయణను వివరణ కోరగా హైస్కూల్స్‌ను ఇంటర్‌మీడియట్ స్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేసినట్లు సమాచారం ఉందని, కాని అధికారికంగా తనకు సమాచారం లేదని తెలిపారు.

వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్

హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌ను హైస్కూల్ ప్లస్ (ఇంటర్‌మీడియట్)గా అప్‌గ్రేడ్ చేస్తుండటంతో గ్రామస్తుల నుంచి హర్షం వ్యక్తమవుతుంది. వీరవాసరంలో విఇసి ఎయిడెడ్ జూనియర్ కళాశాల ఉన్నప్పటికీ దానిని ప్రభుత్వం జూనియర్ కళాశాలగా మార్పు చేయడంలో అడ్డంకులు ఏర్పడ్డాయి. ఇప్పటికీ విఇసి ఎయిడెడ్ జూనియర్ కళాశాలా? లేదా ప్రభుత్వ జూనియర్ కళాశాలా? అనే విషయం తెలియని పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విఇసి జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం కేవలం పది మంది విద్యార్థులు మాత్రమే చేరినట్లు సమాచారం. వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇంటర్ మీడియట్ విద్య అందుబాటులోకి రానున్నడంతో మండలంలో వివిధ గ్రామాలకు చెందిన విద్యావేత్తలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు నుంచి హర్షం వ్యక్తమవుతుంది.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పాలకోడేరులో...

ప్రజాశక్తి - పాలకోడేరు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని , ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పాలకోడేరు మండల పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు) పిలుపునిచ్చారు. వేంద్ర అగ్రహారంలో ఉపాధి హామీ చట్టం (ఎన్ఆర్‌జిఎస్)లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. స్థానిక పంచాయతీ భవనం ఆవరణలో ఎంపిపి చంటిరాజు మొక్కలు నాటి మాట్లాడారు. విస్సాకోడేరులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచి సంబరం మండల ప్రధాన కార్యదర్శి బొల్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మురళి గంగాధర్, ఎన్ఆర్ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ పిల్లి చిట్టి జైబాబు, వేంద్ర అగ్రహారం, కొండేపూడి, వేంద్ర సర్పంచులు కడలి విజయలక్ష్మి, కడలి నాగేశ్వరి, చింతపల్లి చిన్న వెంకట సత్యనారాయణ (చిన్న), నాయకులు కడలి సుబ్రహ్మణ్యం, వేణు, నాగరాజు, రమణ, డ్వాక్రా సిసి మాధవి, శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ స్వాతి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : వాతావరణ కాలుష్య నివారణకు తప్పనిసరిగా మొక్కలు నాటాలని నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. రెవెన్యూ ప్లాంటినేషన్ కార్యక్రమంలో భాగంగా భట్లమాగుటూరు ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తణుకు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎపిడి) బి.వీరాస్వామి మాట్లాడుతూ మండలంలో మొత్తం 650 మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, ఎంపిపి-2 అనిత, ఓడూరు సర్పంచి బుర్రా రవికుమార్, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి, తహశీల్దారు దండు అశోక్‌వర్మ, ఎన్ఆర్ఇజిఎస్ టిఎ ఎం బాపూజీ పాల్గొన్నారు.

గణపవరం :మొక్కల పెంపకంతోనే వల్ల కాలుష్య నివారణ సాధ్యమని పలువురు పంచాయతీ సర్పంచులు అన్నారు. ప్లాంటినేషన్ కార్యక్రమంలో భాగంగా గణపవరం, కోమర్రు, పిప్పర సిహెచ్.అగ్రహారం, కొత్తపల్లి గ్రామ పంచాయతీల్లో 730 కొబ్బరి మొక్కలు నాటినట్లు ఉపాధి హామీ సురేంద్ర చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్‌జిఎస్ ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సర్పంచులు, ఐకెపి సభ్యులు పాల్గొన్నారు.

పోడూరు : ఉపాధి హామీ పనుల్లో భాగంగా శుక్రవారం పోడూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపిడిఒ డి.సుహాసిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి శెట్టిబత్తుల సువర్ణరాజు, ఎఎంసి డైరెక్టర్ గంటా గిరిబాబు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

ఉండి :ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు, వాండ్రం గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ అన్నారు. ఉపాధి హామీ చట్టంలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా వాండ్రం గ్రామంలో దాసరి వెంకటకృష్ణ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జడ్డు వెంకట తాతనాయుడు, ఉపాధి హామీ చట్టం టెక్నికల్ అసిస్టెంట్ ఒమేగా రాజు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పాతపాడు కొత్తోట గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమల బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, వాతాడి ఉమ, రామాని ఉమ, కర్రీ ఏసుబాబు, తన్నీడి గిరి, కొల్లవత్తుల రవికుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెనుమంట్ర :పెనుమంట్ర మండలంలో చెట్లు తొలగిస్తున్న నేపథ్యంలో ఈ నెల 29వ తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నరసాపురం ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్ బి.సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. మార్టేరు 33/11 కెవి సబ్‌స్టేషన్‌లో పరిధిలోని మార్టేరు, నెలమూరు ఫీడర్‌పై మరమ్మతులకు గురైన తీగలు, స్తంభాలు మార్చేందుకు సత్యవరం, కొయ్యేటిపాడు గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కాలువలో గుర్రపుడెక్క తొలగింపు

ప్రజాశక్తి - పోడూరు

కొన్ని రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు మట్టపర్రు శివారులో ఈదిపర్రు మురుగుకాలువలో తూడు గుర్రపుడెక్క విపరీతంగా ఉండటంతో పొలాలు నీట మునుగుతున్నాయి. దీంతో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కాలువలోని తూడు, గుర్రపు డెక్కను శుక్రవారం తొలగించారు. గ్రామ సర్పంచి దొమ్మేటి శ్రీను పనులను పరిశీలించి రైతులను అభినందించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నియంత్రణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజల భాగస్వామ్యంతో దోమల ద్వారా వచ్చే వ్యాధుల నియంత్రణకు అడ్డుకట్ట వేయొచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు తెలిపారు. మండలంలోని వెంకటరామన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుంచనపల్లి, ముత్యాలంబపురంలో జరుగుతున్న 50వ విడత ఫీవర్ సర్వే ప్రదేశాలను, డెంగీ నివారణ మాసోత్సవాలపై అవగాహన కార్యకరమాలను లక్ష్మణరావు శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నవ భారత్ నిర్మాణంలో యువతే కీలకం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నవ భారత నిర్మాణంలో యువతదే కీలక పాత్ర అని భీమవరం డిఎస్‌పి బి.శ్రీనాథ్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కెజిఆర్ఎల్ కళాశాలలో ర్యాగింగ్ దిశ యాప్‌లపై శుక్రవారం అవగాహన సదస్సు, ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీనాథ్ మాట్లాడుతూ వ్యసనాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఒక్కసారి ఛార్జ్ షీట్ నమోదైతే జీవితం నాశనమవుతుందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి చట్టాలపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మెంటే హరినాథ్‌బాబు, ఇన్నర్ వీల్ క్లబ్ జిల్లా కార్యదర్శి అరేటి రాణి, జిల్లా ఆర్గనైజర్ గంధం శ్రీదేవి, పీజీ డైరెక్టర్ డాక్టర్ తోట రామమూర్తి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ జ్యోతి, లక్ష్మిచాయ, నాచు శ్రీవల్లి పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా రామచంద్రరాజు

గణపవరం:గణపవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా యు.రామ చంద్రరాజు శుక్రవారం బాధ్యతలు తీసుకు న్నారు. రామ చంద్రరాజుకు కాలేజీ లెక్చరర్లు, సిబ్బంది పుష్పగుచ్ఛాలందించి స్వాగతం పలికారు.

కౌన్సిల్ సమావేశంలో సభా మర్యాదలు పాటించాలి

నరసాపురం టౌన్ :మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభా మర్యాదలు పాటించాలని ఉద్యోగులు కోరారు. చైర్‌పర్సన్ బర్రె వెంకటరమణ అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జనసేన 22వ కౌన్సిలర్ భారతి సురేష్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కోడూరు వెంకటేశ్వరరావును ఏకవచనంతో సంబోధించారని మున్సిపల్ ఉద్యోగులు చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందించారు. 22వ వార్డు కౌన్సిలర్ భారతిసురేష్ రెండు నెలలు కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకుండా సస్పెండ్ చేసినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.

విద్యుత్ లోపాలను అధిగమించేందుకు కృషి

ఎంపిపి శ్రీహరి నారాయణరాజు

ఉండి :విద్యుత్ సరఫరాలో లోపాలను అధిగమించేందుకు కృషి చేస్తామని ఉండి ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. ఉండి విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో చైర్మన్ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు ఆధ్వర్యంలో మండల విద్యుత్ సలహా మండలి కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే కాకుండా, విద్యుత్ సరఫరా లోపాలను అధిగమించేందుకు ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. ప్రతినెలా సమావేశం నిర్వహిస్తామని, ఎవరైనా విద్యుత్ సమస్యలతో నిరాశ చెందినట్లయితే ఈ కమిటీ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. మండలంలో నూతనంగా ఐదు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య, మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ మాధవరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి శ్రీహరి నారాయణరాజు

ఘనంగా బాబ్జీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

డాక్టర్ సవిత ఉమెన్స్ జూనియర్ కళాశాలలో డాక్టర్ బాబ్జి పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాలేజీలో నిర్వహించిన డ్రాయింగ్, వక్తృత్వ, స్కిప్పింగ్, వ్యాసరచన పోటీలకు పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో వివిధ పాఠశాలల నుంచి 200 మందికి పైగా విద్యార్థినిలు పాల్గొన్నారు. డాక్టర్ బాబ్జి చేతులమీదుగా బహుమతులు అందించారు. మొదటి, ద్వితీయ బహుమ తులతో పాటు అన్ని విభాగాల్లో కాన్సోలేసన్ భాహుమతులు, పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికి సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ విద్యాసంస్థల అధినేత మద్దాల రాంప్రసాద్, డాక్టర్ సవిత జునియర్ కాలేజీ అకాడమిక్ డైరెక్టర్ ఎస్.వసంతలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు : మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జికి ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, వైసిపి నేతలు అడబాల వెంకటరమణ, ముచ్చర్ల శ్రీరామ్, నిమ్మకాయల రామకృష్ణ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. బాబ్జి పుట్టినరోజు వేడుకలు స్థానిక అంజలి మానసిక వికలాంగుల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో ఉన్న పేద రోగుల కోసం విశ్వమానవవేదిక ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 22 మంది సభ్యులు రక్తదానం చేశారని విశ్వమానవవేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్ తెలిపారు. పాలకొల్లు వీర మల్టీస్పెషాలిటీ డెంటల్ క్లినిక్ ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని డాక్టర్ బాబ్జి ప్రారంభించారు.

మహారాజశ్రీ జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జంగారెడ్డిగూడెం

ఐ.ఎ.నెం.388/2023, ఓ.ఎస్.నెం.126/2022

మధ్య:
శ్రీమతి కాళింగి భద్రకాళి ...వాది
మరియు
శ్రీ ధర్మాలకోట దుర్గా శంకర్ వగైరాలు ...ప్రతివాదులు

టు: ప్రతివాదులు:
1) శ్రీ ధర్మాలకోట దుర్గా శంకర్, H/o. లేటు నెక్కింటి పుష్పలత, హిందూ, పు॥, వ॥58 సం॥లు, హైస్కూలు దగ్గర, ఆశ్వారావుపేట రోడ్డు, జంగారెడ్డిగూడెం (V&M), ఏలూరు జిల్లా.
2) శ్రీమతి వలసపల్లి అఖిల @ ధర్మాలకోట అఖిల, భర్త: జగదీష్, స్త్రీ, వ॥ 32 సం॥లు, నాచారం గ్రామం, పోస్టు, దమ్మపేట మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
3) శ్రీ ధర్మాలకోట నిఖిల్, తండ్రి: దుర్గా శంకర్, పు॥, వ॥35 సం॥లు, హైస్కూలు దగ్గర, ఆశ్వారావుపేట రోడ్డు, జంగారెడ్డిగూడెం (V&M), ఏలూరు జిల్లా.

ఈ నంబరు దావాలో శ్రీ కోర్టు వారు మీకు దావా సమన్లును రిజిష్టరు పోస్టు ద్వారాను, కోర్టు వారి ద్వారాను, ఎన్నిమార్లు పంపించిననూ మీరు బుద్ధిపూర్వకంగా తీసుకోకుండా Avoid చేయుచున్నందున తేది **29-08-2023 సమయం 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా మీ తరపు న్యాయవాది వారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

మోదేపల్లి నాగులు
జంగారెడ్డిగూడెం. అడ్వకేట్, జంగారెడ్డిగూడెం.
29-07-2023. సెల్: 96407 19598

కళాశాల అభివృద్ధికి రూ.15 వేలు విరాళం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు దాసరి నారాయణరావు ఉమెన్స్ డిగ్రీ కాలేజీ అభివృద్ధికి న్యాయవాది, వైసిపి మహిళా నాయకులు కర్రా జయసరిత ముఖ్య అతిథిగా రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్, లెక్చరర్లు, కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, KATTA CHIRANJEEVI, S/o. VENKATESWARA RAO KATTA, R/o. D.No.3-43, M Nagulapalli (V), Dwarakatirumala Mandal, Eluru Dist A.P. Iam a resident of M Nagulapalli, holding **Passport (No.J9211083)** in that passport my name noted as **KATTA CHINRANJEEVI** but as per my Aadhar correct name spelling is **KATTA CHIRANJEEVI.** Hence I confirm and affirm that my correct name is **KATTA CHIRANJEEVI** should be considered for all purpose.

In The Court Of The Addl. Senior Civil Judge :: Eluru
I.P.No. 17/2022

Between:
Melam Naga Raju ***...Petitioner***
AND
Kakulapu Satish Kumar and 5 Others ***...Respondents***

R-3: Katamareddy Venkata Subramanyam, S/o. Pothuraju, Denduluru, W.G.Dist.

పై నెంబరు ఐ.పి.లో మీరు ఆర్3 అయి ఉన్నారు. శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసు పంపిననూ మీకు అమలు జరగని కారణంచే ఈ పేపరు ప్రకటన ద్వారా అమలుకు ఉత్తర్వులు ఇచ్చినారు. కావున మీరు పై కోర్టు వారి ఎదుట **ది.25-08-2023వ తేదీన మీరు గాని, మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరు కాగలరు.** లేని ఎడల మీ పరోక్షముగా విచారించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఎం.కేదారి
డి.వి.అప్పారావు
ఏలూరు, అడ్వకేట్స్, ఏలూరు.
26-7-23. సెల్: 94401 11079

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 472/2022

బిట్వీన్:
వాది: మేకల కృష్ణ, తండ్రి: వెంకటస్వామి, R/o. చేతపూడి, భీమవరం మండలం.
మరియు
ప్రతివాదులు:
1) మెరిపె గంగాధర్, తండ్రి: (లేటు) మరియదాసు, వయసు 35 సం॥లు, R/o. గండిదిబ్బ, ఆర్.సి.ఎం. చర్చి దగ్గర, గొల్లవానితిప్ప, భీమవరం మండలం.
2) మెరిపె నరసింహారావు, తండ్రి: (లేటు) మరియదాసు, వయసు 30 సం॥లు, R/o. గండిదిబ్బ, ఆర్.సి.ఎం. చర్చి దగ్గర, గొల్లవానితిప్ప, భీమవరం మండలం.
3) నేరెళ్ళ బాల వెంకట నాగమణి, తండ్రి: (లేటు) మరియదాసు, వయసు 38 సం॥లు, R/o. గండిదిబ్బ, ఆర్.సి.ఎం. చర్చి దగ్గర, గొల్లవానితిప్ప, భీమవరం మండలం.
4) మెరిపె హైమవతి, తండ్రి: (లేటు) మరియదాసు, వయసు 28 సం॥లు, R/o. గండిదిబ్బ, ఆర్.సి.ఎం. చర్చి దగ్గర, గొల్లవానితిప్ప, భీమవరం మండలం.

పై నెంబరు దావాలో వాది అయిన మేకల కృష్ణ ప్రతివాదులైన మెరిపె గంగాధర్, మెరిపె నరసింహారావు, నేరెళ్ళ బాల వెంకట నాగమణి, మెరిపె హైమవతి అను మీకు కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ అందుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఆ విషయమై కోర్టులో పిటీషను దాఖలు చేసినందున, పై దావా విషయంలో మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల **ది.14-08-2023వ తేదీన ఉదయం గం॥ 10:00 ని॥లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై వారితో మనవి చేసుకోవలసినది.** లేని ఎడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 14-08-2023
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పాకా రమేష్ బాబు
కట్టా మాలతీలత
భీమవరం, అడ్వకేట్స్, భీమవరం.
28-7-23. సెల్: 97018 42726

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 410/2022, ఓ.ఎస్.నెం. 472/2022

బిట్వీన్:
పిటీషనరు/వాది: మేకల కృష్ణ, తండ్రి: వెంకటస్వామి, R/o. చేతపూడి, భీమవరం మండలం.
మరియు
రెస్పాండెంట్లు /ప్రతివాదులు:
1) మెరిపె గంగాధర్, తండ్రి: (లేటు) మరియదాసు, వయసు 35 సం॥లు, R/o. గండిదిబ్బ, ఆర్.సి.ఎం. చర్చి దగ్గర, గొల్లవానితిప్ప, భీమవరం మండలం.
2) మెరిపె నరసింహారావు, తండ్రి: (లేటు) మరియదాసు, వయసు 30 సం॥లు, R/o. గండిదిబ్బ, ఆర్.సి.ఎం. చర్చి దగ్గర, గొల్లవానితిప్ప, భీమవరం మండలం.
3) నేరెళ్ళ బాల వెంకట నాగమణి, తండ్రి: (లేటు) మరియదాసు, వయసు 38 సం॥లు, R/o. గండిదిబ్బ, ఆర్.సి.ఎం. చర్చి దగ్గర, గొల్లవానితిప్ప, భీమవరం మండలం.
4) మెరిపె హైమవతి, తండ్రి: (లేటు) మరియదాసు, వయసు 28 సం॥లు, R/o. గండిదిబ్బ, ఆర్.సి.ఎం. చర్చి దగ్గర, గొల్లవానితిప్ప, భీమవరం మండలం.

పై నెంబరు పిటీషనులో పిటీషనర్లు అయిన మేకల కృష్ణ రెస్పాండెంట్లు అయిన మెరిపె గంగాధర్, మెరిపె నరసింహారావు, నేరెళ్ళ బాల వెంకట నాగమణి, మెరిపె హైమవతి అను మీకు కోర్టు ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ అందుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఆ విషయమై కోర్టులో పిటీషను దాఖలు చేసినందున, పై దావా విషయంలో మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల **ది.14-08-2023వ తేదీన ఉదయం గం॥ 10:00 ని॥లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై వారితో మనవి చేసుకోవలసినది.** లేని ఎడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

వాయిదా తేది : 14-08-2023
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

పాకా రమేష్ బాబు
కట్టా మాలతీలత
భీమవరం, అడ్వకేట్స్, భీమవరం.
28-7-23. సెల్: 97018 42726